# సాక్షి
## తూర్పుగోదావరి

గురువారం । 6 । ఏప్రిల్ । 2023







### అమ్మవారికి వెండి కిరీటం
మలికిపురం: గూడపల్లి నూకాలమ్మ అమ్మవారికి బుధవారం రుద్ర మల్లికార్జునరావు కుటుంబ సభ్యులు రెండు కిలోల వెండి కిరీటాన్ని బహూకరించారు.



### పరీక్షలు షురూ.. వేసవి జోరు
ఎండలు ముదురుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలతో పాటు విద్యార్థుల్లో పరీక్షల వేడి కూడా మొదలైంది. మూడో తేదీ నుంచి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. - 8లో..

### డెల్టాలకు నీరు విడుదల


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 6,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,850, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,200 క్యూసెక్కులు వదిలారు.




## న్యూస్‌రీల్

### దరఖాస్తుల ఆహ్వానం


దినేష్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలో అభివృద్ధి చేస్తున్న జంక్షన్లు, గ్రీనరీ నిర్వహణ కోసం ఆసక్తిగల స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో పలు కూడళ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అక్కడ పరిశుభ్రత, గ్రీనరీ మెయింటెనెన్స్ చేయాలన్నారు. ఆసక్తి కల వారు సోమవారం లోపు నగరపాలకసంస్థకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీరు గ్రీనరీ, ఫుట్‌పాత్, విగ్రహాలు, ఫౌంటైన్లను స్వచ్ఛందంగా నిర్వహించాల్సి ఉంటుందన్నారు.

### జీతాల జాప్యంపై అధికారుల ఆరా
**– సాక్షి కథనానికి స్పందన**

కాకినాడ క్రైం: 'మరీ ఇంత నిర్లక్ష్యమా...' శీర్షికతో బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ సంచాలకుడు డాక్టర్ వి.రామిరెడ్డి ఈ కథనంపై ఆరా తీశారు. ఏడు నెలలు గడిచినా జీతాలు చెల్లించకపోవడంపై ఆయన కార్యాలయ వర్గాలు కలెక్టరేట్, డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాల నుంచి శుక్రవారం వివరాలు సేకరించాయి. ఈ నిర్లక్ష్యం వెనుక డీఎంహెచ్‌వో ఉద్యోగుల పాత్రతో పాటు, పారా మెడికల్ ఉద్యోగి కే.సూర్యచంద్ర డీఎంహెచ్‌వో కార్యాలయంలో కీలక ఏవో పోస్టులో కొనసాగడంపై ఆరా తీసి నివేదించాయి. ప్రస్తుత ఇంఛార్జి డీఎంహెచ్‌వోగా కొనసాగుతున్న రోణంకి రమేషే డిప్యూటీ డెమోగా ఉన్న పారామెడికల్ ఉద్యోగి సూర్యచంద్రను ఇంఛార్జి ఏవో పోస్టు కోసం సిఫార్సు చేసి నియమించినట్లు డీహెచ్ పరిశీలనలో తేలింది. ఈ విషయంపై డీహెచ్ డాక్టర్ రామిరెడ్డిని వివరణ కోరగా, ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు విడుదల చేసినా చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. ఏవో ప్రమోషన్ల ఫైల్ సిద్ధమవుతుందని డాక్టర్ రామిరెడ్డి తెలిపారు. ఈ లోపు ఇంఛార్జి ఏవోను తొలగించి ఆ స్థానంలో ఆర్ఎంసీ లేదా జీజీహెచ్ ఏవోలకు తాత్కాలిక బాధ్యతలు అప్పగిస్తామని డీహెచ్ అన్నారు.

### జీజీహెచ్‌లో ఇద్దరికి కోవిడ్


కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో ఇద్దరికి కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. ఆసుపత్రిలో విధులు నిర్వర్తించే 31 ఏళ్ల మైక్రోబయాలజీ సీనియర్ రెసిడెంట్ వైద్యురాలితో పాటు, 20 ఏళ్ల జీఎస్ఎం మూడవ సంవత్సరం విద్యార్థినికి కోవిడ్ సోకినట్లు అధికార వర్గాలు ధ్రువీకరించాయి. మంగళవారం సేకరించిన 43 నమూనాలను పరీక్షిస్తే ఈ ఫలితం వెల్లడైంది.

### అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు
ఆలమూరు: అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మండలంలోని చెముడులంకలో అభిషేకాలు జరిగాయి. గురుస్వామి గారపాటి శివన్నారాయణ ఆధ్వర్యాన వేద పండితులు శ్రీరామచంద్రమూర్తి మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ తమ్మన శ్రీనివాసు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి భక్తులు 36 రకాల పండ్ల రసాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ పౌర్ణమి తిథి, ఉత్తర నక్షత్రం పుణ్యలగ్నాన అయ్యప్ప స్వామి జన్మదినాన్ని జరుపుతామని గురుస్వామి శివన్నారాయణ తెలిపారు.

### గోదావరి మాతకు పున్నమి హారతి
ఆలమూరు: మండలంలోని జొన్నాడలోని అఖండ గౌతమీ గోదావరి తీరంలో బుధవారం సాయంకాలం గోదావరి మాతకు అఖండ పున్నమి హారతి జరిగింది. ప్రముఖ వేద పండితుడు ద్విభాష్యం రవికృష్ణ శర్మ పర్యవేక్షణలో గ్రామానికి సత్తి రామకృష్ణారెడ్డి, నాగమణి దంపతుల ఆధ్వర్యంలో మహిళ భక్త బంద సభ్యులు శాస్త్రోక్తంగా ఈ పున్నమి హారతి ఇచ్చారు.



# జైలు పాఠాలు

- కేంద్రకారాగారంలో విద్యాసుమాలు
- అక్షర బాట పడుతున్న ఖైదీలు
- అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ద్వారా డిగ్రీలు చదువుతున్న వైనం
- శిక్షణగా మారుతున్న శిక్షాకాలం

| | |
|---|---|
| శిక్ష అనుభవిస్తున్న వారు | 738 మంది |
| యావజ్జీవ ఖైదీలు | 550 మంది |
| రిమాండ్ ఖైదీల సంఖ్య | 994 మంది |
| పీజీ చదువుతున్నవారు | 77 మంది |
| డిగ్రీ చదువుతున్నవారు | 135 మంది |
| ప్రాథమిక విద్య | 28 మంది |

(డెస్క్–రాజమహేంద్రవరం): చదువు దారి చూపుతుంది. దారి తప్పిన వారిని సన్మార్గంలోనూ నడుపుతుంది. రాజమహేంద్రవరంలోని కేంద్రకారాగారంలోని కొందరు ఖైదీల గురించి తెలుసుకుంటే ఇది అక్షర సత్యమని అర్థమవుతుంది. వివిధ పరిస్థితుల నేపథ్యంలో.. క్షణికావేశంలో కొందరు నేరానికి పాల్పడుతుంటారు. వీరంతా జైలుకు వచ్చి శిక్ష అనుభవిస్తారు. అయితే ఇక్కడి కారాగారం అధికారులు మాత్రం వీరి శిక్షను శిక్షణగా మారుస్తున్నారు. ఇందులో భాగంగా వీరిలో విద్యావెలుగులు నింపుతున్నారు. జైలులో జీవితం వృథా కాకుండా ఖైదీలను విద్యాబాట పట్టిస్తున్నారు. పరివర్తన దిశగా అడుగులు వేయిస్తున్నారు. సెంట్రల్ జైలుకు రాకముందు ఆపేసిన విద్యను చాలామంది ఇక్కడికి వచ్చాక కొనసాగించగలుగుతున్నారు. డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ ద్వారా వీరంతా పట్టభద్రులవుతున్నారు. కొందరు పోస్టు గ్రాడ్యుయేషన్ కూడా చేస్తున్నారు. ప్రస్తుతం 135 మంది డిగ్రీ చదువుతుండగా 87మంది ఎంఏ చదువుతున్నారు. 638 మంది ఇప్పటికే డిగ్రీ పూర్తి చేయడం విశేషం. వీరికోసం జైలు ప్రాంగణంలోనే పరీక్ష సెంటరు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్‌గా వీరికి క్లాసులు చెప్పడానికి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి ఫ్యాకల్టీ సేవలను వినియోగించుకుంటున్నట్లు సెంట్రల్ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ రాజకుమార్ 'సాక్షి'కి తెలిపారు. పెద్ద వయసుండీ నిరక్షరాస్యులైన ఖైదీలకు సైతం రాయడం చదవడం నేర్పుతున్నారు. ప్రస్తుతం 28మంది ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి అనంతలక్ష్మి అనే టీచరు బోధిస్తున్నారు.

**అబ్బురపరిచే లైబ్రరీ**

ఖైదీలు చదువుకునేందుకు లైబ్రరీ ఉంది. ఇందులో 4,300 పుస్తకాలు ఉన్నాయి. ముఖ్యంగా వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు..ఆధ్యాత్మిక భావన కలిగించేందుకు దోహదపడే పుస్తకాలు ఉన్నాయి. లక్ష రూపాయల విలువైన పుస్తకాలను జైలు అధికారులు కొనుగోలు చేశారు. చదువుతోపాటు వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంచేందుకు ఒక సెంటరును నిర్వహిస్తున్నారు. వెల్డింగ్..ప్లంబింగ్ కోర్సులకు ఇందులో శిక్షణ ఇస్తున్నారు. ఖరీదైన శిక్షణ పరికరాలను అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం 30 మంది వంతున ఖైదీలు ఈ కోర్సులు నేర్చుకుంటున్నారు.

**గోల్డు మెడలిస్టులూ ఉన్నారు**

సెంట్రల్‌జైలులో శిక్షను అనుభవిస్తూ పట్టభద్రులైన కొందరు విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. షేక్ అజారుద్దీన్ బీఏలో స్వర్ణ పతకాన్ని సాధించారు. షేక్ సుభానీ ..టి వెంకటేశ్వరరావులు కూడా ఇదీ డిగ్రీలో గోల్డు మెడల్ సాధించారు. విజయవాడకు చెందిన జీ విజయరామ్ జైలులోనే పీజీ చదివి విడుదలయ్యాక వీఆర్‌ఓ ఉద్యోగాన్ని పొందారు. సారేపల్లి శ్రీనివాస్ మూడు డిగ్రీలు చదివారు. రంపచోడవరానికి చెందిన శ్రీనివాస్ కూడా మూడు పీజీలు చేశారు.

### ఇక్కడ పీజీ చదివాను


మాది గుంటూరు. 30సంవత్సరాలుగా ఇక్కడ జైలులో ఉంటున్నాను. జైలుకు రాకముందు కరస్పాండెన్స్ కోర్సు డిగ్రీ చేయాలనుకున్నాను. ఇక్కడకు వచ్చాక పూర్తిగా చదువుపై దృష్టి పెట్టాను. ఎంఏ చదివాను. ఇక్కడి అధికారుల ప్రోత్సాహం నాలో ఉత్సాహాన్ని పెంచింది. నాకు ఇప్పుడు 54 సంవత్సరాల వయసు వచ్చింది. చదవడం వల్ల చాలా తెలుసుకున్నాను. విద్య మనిషిలో సత్ప్రవర్తనను పెంచుతుందని గ్రహించాను. విడుదల కోసం ఎదురుచూస్తున్నాను.

– గంటెల విజయవర్ధన్

### మూడు ఎంఏలు చేశాను


మాది రంప చోడవరం. నేను జైలుకు వచ్చి 11 సంవత్సరాలు అవుతోంది. ఓ హత్య కేసులో నాకు శిక్ష పడింది. జైలుకు వచ్చే ముందు ఎమ్మెస్సీ బీఈడీ చదివాను. ఇప్పుడు మూడు ఎంఏలు చేశాను. పాలిటిక్స్..పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్..సోషియాలజీలతో ఈ పీజీలు చదివాను. ఈ శిక్షా కాలం నా జీవితంలో ఊరికే పోలేదని భావిస్తున్నాను. జైలు అధికారుల తోడ్పాటుతో మళ్లీ చదువుకోగలిగాను. చదువు వల్ల ఆత్మవిశ్వాసం పెరిగింది. గౌరవమూ పొందగలుగుతుండటం నాకు సంతోషం కలిగిస్తోంది.

– శ్రీనివాస దొర



ఖైదీలకు నీతి కథ వివరిస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్ రాజకుమార్



ఖైదీలు వివిధ కోర్సులు చదివేది ఇక్కడే

### పరివర్తనే ధ్యేయంగా..


ఖైదీలలో పరివర్తనే ధ్యేయంగా పనిచేస్తున్నాం. శిక్షాకాలంలో విద్య లేదా నైపుణ్య కోర్సు నేర్చుకునో బయటకు వెళ్లాక ఉపాధి బాట పట్టేలా తీర్చిదిద్దేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. ఈ విషయంలో ఎప్పటికప్పుడు కొత్త ప్రణాళికలను రూపొందించి అనుసరిస్తున్నాం. మళ్లీ నేరాల వైపు మనసు మళ్లకుండా ఉద్యోగం లేదా ఉపాధి వైపు దృష్టి పెట్టాలనేది మా అభిమతం. అందుకే జైలులో శిక్షాకాలం వృథా కానీయడం లేదు. ప్రభుత్వం నుంచి కూడా ఇందుకు మంచి సహకారం లభిస్తోంది. ఖైదీలు చదువుకోడానికి ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. వీరిని ఉత్సాహపరిచేలా సహకారం అందిస్తున్నాం.

– రాజారావు, జైలు సూపరింటెండెంట్

## బడుగుల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్



జయంతి సభలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో కలెక్టర్ మాధవీలత తదితరులు



కొవ్వూరులో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): బడుగుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని కలెక్టర్ మాధవీలత అన్నారు. ఆయన జయంతి సందర్భంగా బుధవారం జాంపేటలోని చర్చిపేట వద్ద గల విగ్రహానికి కలెక్టర్ మాధవీలత, ఎంపీ భరత్ రామ్, జేసీ తేజ్ భరత్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ తదితరులు పుష్పాంజలి ఘటించారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి జి.జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన సేవలను జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ కొనియాడారు. నేటి యువత ఆయన నుంచి ఎంతో స్ఫూర్తి పొందాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో జి.నరసింహులు, జిల్లా అధికారులు కేఎస్ జ్యోతి, ఎస్.మాధవరావు, పి.ప్రసాదరావు, పి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

**జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడు : హోం మంత్రి**

కొవ్వూరు: ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, 30 ఏళ్ల పాటు కేంద్ర మంత్రిగా దేశానికి సేవలందించిన భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. బుధవారం దళిత బాంధవుడు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా కొవ్వూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి వనిత పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కొవ్వూరు మెయిన్ రోడ్డు, మూడో వార్డు మెరక వీధిలోని జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఆమె పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దళితులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి పడిన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా మంత్రి వనిత పేర్కొన్నారు. జగ్జీవన్ చూపిన బాటలో నేటి యువత ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సలాది సందీప్, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి , నాయకులు వరిగేటి సుధాకర్, గాడి శరత్ రాజ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు దేవగుప్తాపు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభ్యున్నతే జగన్ లక్ష్యం

- ఎంపీ భరత్ రామ్
- వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు పంపిణీ



ఆసరా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: మహిళల ఆర్థిక అభ్యున్నతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, దీనికోసం అనేక కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని 36, 39 డివిజన్లకు చెందిన వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు బుధవారం స్థానిక తుమ్మలావ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో పెత్తందారీ వ్యవస్థ నడిచేదని, అర్హులెవ్వరికీ ఎటువంటి సంక్షేమ ఫలాలు అందేవి కావన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో పేదలకు పీడించేవారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన అర్హులందరికీ న్యాయం జరుగుతోందన్నారు. ఈ నాలుగేళ్లలో రూ.2 లక్షల కోట్లను వివిధ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారన్నారు. ఇక్కడ ప్రజాప్రతినిధులు, దళారుల ప్రమేయం ఉండదని, పేదరికమే అర్హతగా సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు.

**చంద్రబాబు పాలనలో అస్తవ్యస్తం**

ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ చంద్రబాబు పాలన వల్ల అస్తవ్యస్తంగా తయారైన రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే జగనన్న గాడిలో పెడుతున్నారన్నారు. మళ్లీ చంద్రబాబు చేతిలోకి పాలన వెళ్లిందంటే.. అభివృద్ధి కుంటుపడి రాష్ట్రం తిరోగమన దిశలో పయనిస్తుందన్నారు. రానున్న ఎన్నికలలో మరోసారి సీఎంగా జగనన్నను నెగ్గించాలని మహిళలను కోరారు. తాను ఎంపీగా ఈ నాలుగేళ్లలో నగరంలో చేసిన అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా లబ్ధిదారులకు వివరించారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, లబ్ధిదారులకు ఆసరా నమూనా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, 39వ డివిజన్ ఇన్‌చార్జి లంకా ప్రసాద్, గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీ ప్రియ, నగర యువజన విభాగం అధ్యక్షుడు పిట్టా రామకృష్ణ, పాలిక శ్రీను, పోలు విజయలక్ష్మి, కొత్త విజయ రాజ్యలక్ష్మి, బర్రే కొండబాబు, నక్కా నగేష్, ఉల్లూరి రాజు పాల్గొన్నారు.

## 'మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హోంమంత్రి తానేటి వనిత

కొవ్వూరు: 'జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్‌ను బుధవారం రాత్రి హోంమంత్రి తానేటి వనిత తమ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శుక్రవారం నుంచి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 20 వరకూ కొనసాగుతుందన్నారు. ప్రతీ గ్రామంలో పార్టీ తరఫున సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజలను కలిసి అభిప్రాయాలను తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో పాల్గొని గత ప్రభుత్వాలకు తమ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను వివరించాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభి రామారావు,పట్టణ పార్టీ అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు రుత్తల భాస్కరరావు, నగళ్ల పాటి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల చెంతకు ఫ్యామిలీ డాక్టర్

- నేటి నుంచి పూర్తిస్థాయిలో సేవలు
- జిల్లాలో 34 వాహనాల(104)తో వైద్యసేవలు




ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్‌లో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్(ఫైల్), రోగులకు మందుల పంపిణీ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ గురువారం నుంచి పూర్తిస్థాయిలో అమలుకు రంగం సిద్ధమైంది. గతేడాది అక్టోబర్ 21న ప్రారంభమైన ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్‌లో ఇప్పటివరకు 2,20,296 మందికి ఓపీ సేవలు అందించారు. 10,011 మంది గర్భిణులు, 5,536 మంది బాలింతలు, 1838 మందికి రక్తహీనత, 57,835 మందికి హైపర్ టెన్షన్, 45,620 మంది డయాబెటీస్ రోగులకు వైద్యసేవలు అందించారు. వివిధ రకాల పరీక్షలు నిర్వహించి 67 రకాల మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

**వైద్యులు, సిబ్బందికి శిక్షణ**

అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో మాత్రమే ఉన్న కుటుంబ వైద్యుల విధానాన్ని ఇక్కడ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది అక్టోబర్ 21న ఫ్యామిలీ డాక్టర్ విధానం ట్రయల్ రన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం విజయవంతమైంది. ఈ నేపథ్యంలో గురువారం నుంచి జిల్లాలోని 35 గ్రామ సచివాలయాల పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నారు. ఇందుకోసం డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, ఫ్యామిలీ డాక్టర్ నోడల్ అధికారి డాక్టర్ వరలక్ష్మి ఇప్పటికే ఆయా పీహెచ్‌సీల పరిధిలో అవగాహన, శిక్షణ కార్యక్రమాలు కొనసాగించారు. వైద్యసిబ్బందిని సంసిద్ధులు చేశారు.

**సచివాలయాల పరిధిలో..**

జిల్లాలోని రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, అనపర్తి, నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో ఉన్న 365 గ్రామ సచివాలయాల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా 104 సిబ్బందితో కలిసి వైద్యులు ప్రతి నెలా రెండు రోజుల పాటు వైద్యసేవలు అందిస్తారు. ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇద్దరు వైద్యులు ఉంటారు. వారిలో ఒకరు 104 వాహనంలో గ్రామ సచివాలయం పరిధిలో పర్యటిస్తారు. మరో వైద్యుడు పీహెచ్‌సీలో ఉంటారు. వాహనం ద్వారా 12 రకాల వైద్యసేవలు, 14 రకాల వైద్య పరీక్షలు, 67 రకాల మందులను అందిస్తారు.

**నేడు లాంఛనంగా ప్రారంభం**

కడియం సచివాలయం–4లో కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, అలాగే కొవ్వూరు నియోజకవర్గంలో హోంమంత్రి తానేటి వనిత, రాజానగరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, అనపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తిసూర్యనారాయణరెడ్డి, నిడదవోలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు, గోపాలపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు లాంఛనంగా ప్రారంభించనున్నారు.

### పూర్తయిన ఏర్పాట్లు


ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ట్రయల్ రన్ విజయవంతంగా చేపట్టాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం నుంచి 33 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. వైద్యులు, పారా మెడికల్ సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. రోగులకు పరీక్షలు నిర్వహించి 15 రోజులకు సరిపడే మందులు అందిస్తాం.

– డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్‌వో

### 95.57 శాతం పింఛన్ల పంపిణీ
రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక పింఛన్ల పంపిణీ మూడోరోజు బుధవారం 95.57 శాతం పూర్తయింది. 2,35,248 పింఛన్లకు గాను 2,24,818మందికి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో రూ.64.84 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా రూ.61.96 కోట్లను లబ్ధిదారులకు అందజేశారు. రాష్ట్రంలో పింఛన్ల పంపిణీలో జిల్లా ఏడో స్థానంలో నిలిచింది. జిల్లాలో నిడదవోలు అర్బన్ 98.16 శాతంతో ప్రథమ, గోకవరం 88.51 శాతంతో చివరిస్థానాల్లో నిలిచింది. మిగిలిన పింఛన్‌దారులకు గురు, శుక్రవారాల్లో పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతిపథం ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సుభాషిణి తెలిపారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్

## క్లుప్తంగా

### పురోహితుల క్రికెట్ టోర్నీ ప్రారంభం



పోటీల ప్రారంభోత్సవంలో క్రికెట్ ఆడుతున్న వీరన్న

కొవ్వూరు: ఐ.పంగిడి గ్రామంలో బుధవారం రాష్ట్ర స్థాయి పురోహితుల క్రికెట్ టోర్నమెంటును జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, టీడీపీ నేత పాత్రు సిద్దూ ప్రారంభించారు. కొద్దిసేపు క్రికెట్ ఆడి టోర్నమెంటు ప్రారంభించారు. ఈ నెల 11వ తేదీ వరకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర పురోహిత సంఘం అధ్యక్షుడు వారణాసి హనుమంతశర్మ తెలిపారు. మొదటి రోజు ఖమ్మం, నూజివీడు, కొవ్వూరు, వాడపల్లి, కాకినాడ జట్లు పోటీల్లో పాల్గొన్నాయని తెలిపారు. సంఘ సభ్యులు విస్సాప్రగడ ప్రతాప్, కృష్ణంపల్లి అనిల్, బొందలపాటి సుబ్రహ్మణ్య శర్మ, రాళ్లపల్లి సాయి పాల్గొన్నారు.

### యథార్థ ఘటన ఆధారంగా 'వారెవ్వా జతగాళ్లు'



వారెవ్వా జతగాళ్లు చిత్ర విశేషాలను వివరించిన దర్శకుడు సత్య సలాది

సామర్లకోట: తమిళనాడులో జరిగిన ఒక యథార్థ సంఘటన ఆధారంగా 'వారెవ్వా జతగాళ్లు' చిత్రం నిర్మించామని దర్శకుడు సత్య సలాది తెలిపారు. బుధవారం స్థానికంగా ఉన్న తన స్వగృహంలో సినిమా హీరో పిట్టా లక్ష్మణ్ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సినిమా విశేషాలను వివరించారు. ఈ సినిమా నూతన నటీనటులతో నిర్మించామన్నారు. ఐదు భాషల్లో దేశవ్యాప్తంగా సుమారు 650 థియేటర్లలో మే నెలలో రిలీజ్‌కు చేయనున్నట్లు చెప్పారు. తన స్వగ్రామం సామర్లకోట మండలం ఉండూరు అన్నారు. అల్లరి చిల్లరగా తిరిగే నలుగురు యువకులు గ్రామస్తులు మెచ్చుకునే పనులు చేసి వారెవ్వా జతగాళ్లు అనిపించుకొంటారని చెప్పారు. పోసాని కృష్ణ మురళి, జబర్దస్త్ మురళి, కన్నడ నటుడు రాబర్ట్ లూయిస్, ప్రియాంక, మమత ఇందులో నటించారని వివరించారు. జిల్లాకు చెందిన సాయిపవన్, లక్ష్మణ్, రాజబాబు, అరవిందస్వామి హీరోలుగా పరిచయం అవుతున్నారన్నారు. నిర్మాతలుగా బండారు నాగబాబు, దొడ్డి వీర ప్రభాకర్, వీరబాబు వ్యవహరిస్తున్నారని తెలిపారు. మ్యూజిక్ డైరెక్టర్ సంతోష్, గాయకులు శ్రీకృష్ణ, రామ్కి వరం ఈ చిత్రానికి పని చేశారని వివరించారు. సినీ దర్శకుడు కేబీ ఆనంద్ పాల్గొన్నారు.

# పరీక్షలు షురూ.. వేసవి జోరు

- ఈ నెల 20 నుంచి 1–9 తరగతులకు ఎస్ఏ–2
- సీబీఏ విధానంలో నిర్వహణ
- వచ్చే నెల ఒకటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

రాయవరం: వేసవికాలం వచ్చేసింది. ఎండలు ముదురుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలతో పాటు విద్యార్థుల్లో పరీక్షల వేడి కూడా మొదలైంది. ఈ నెల మూడో తేదీ నుంచి నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తయ్యాయి. ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు వార్షిక పరీక్షలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 1–5 తరగతులకు ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. 1–5 తరగతులకు ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించాలి.6–9 తరగతులకు 20 నుంచి 29వ తేదీ వరకు ఉదయం పరీక్షలు నిర్వహిస్తారు. 9వ తరగతికి ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. వేసవి తీవ్రతను దష్టిలో ఉంచుకుని ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ ఈ నెల మూడో తేదీ నుంచి ఒంటిపూట బడుల నిర్వహణకు ఆదేశాలిచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో వార్షిక పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పరిధిలో విద్యాభ్యాసం చేస్తున్న 7.40లక్షల మంది విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరు కానున్నారు.



**సీబీఏ విధానంలో..**

క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ (సీబీఏ) విధానంలో సమ్మేటివ్–2 పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎస్‌సీఈఆర్‌టీ సీబీఏ విధానాన్ని కొన్ని పరీక్షలకు అమలు చేస్తున్నారు. ఎఫ్–1, ఎఫ్ఏ–3 పరీక్షలను ఇప్పటికే సీబీఏ విధానంలో అమలు చేశారు. ఎఫ్ఏ–2, ఎఫ్ఏ–4, సమ్మేటివ్–1 పరీక్షలను పాత విధానంలోనే నిర్వహించారు. ప్రస్తుతం నిర్వహించనున్న సమ్మేటివ్–2 పరీక్షలను ఓఎంఆర్ విధానంలో విద్యార్థులు రాయాల్సి ఉంది.

**టైం టేబుల్ విడుదల..**

పరీక్షల నిర్వహణకు ఎస్‌సీఈఆర్‌టీ టైమ్ టేబుల్ విడుదల చేసింది. పరీక్షల నిర్వహణ అనంతరం జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి ఫలితాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు సూచించారు. మే 15వ తేదీ లోగా ప్రమోషన్ జాబితాలను సిద్ధం చేయాలని విద్యాశాఖ ఆదేశాల్లో పేర్కొంది. 1–2 తరగతులకు 20న తెలుగు, 24న ఇంగ్లిషు, 25న గణితం, 3–5 తరగతులకు 20న తెలుగు, 24న ఇంగ్లిషు, 25న గణితం, 26న పరిసరాల విజ్ఞానం, 6–9 తరగతులకు ఏప్రిల్ 20న తెలుగు, 24న హిందీ, 25న ఇంగ్లిషు, 26న గణితం, 27న జనరల్ సైన్సు, 28న సోషల్ స్టడీస్, 29న కాంపోజిట్ కోర్సులు పేపర్–1, మే 4న కాంపోజిట్ కోర్సులు పేపర్–2 నిర్వహిస్తారు.

**ప్రశ్నాపత్రాల పంపిణీకి చర్యలు**

మండల విద్యాశాఖ కార్యాలయాలకు ప్రశ్నపత్రాలను చేర్చే పనిలో జిల్లా కామన్ ఎగ్జామ్ బోర్డు(డీసీఈబీ) నిమగ్నమైంది. ఈ నెల 18వ తేదీ నాటికి మండల కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను పంపించే అవకాశం ఉంది. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ప్రశ్నపత్రాలను సరిచూసుకుని ఎమ్మార్సీలో భద్రపర్చుకోవాలి. పరీక్షల ప్రారంభం నుంచి సంబంధిత ప్రశ్నపత్రాల బండిళ్లను ఏరోజుకారోజు పరీక్షకు గంట ముందు ఎమ్మార్సీల నుంచి హెచ్‌ఎంలు వచ్చి తీసుకెళ్లాల్సి ఉంటుంది.

**ఈ నిబంధనలు పాటించాలి**

- ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ప్రశ్నపత్రాల భద్రతకు ట్రంకు పెట్టెలు ఏర్పాటు చేసుకోవాలి.
- ఎంఈవోలు ఏ రోజు ప్రశ్నపత్రాలను ఆరోజే ఇవ్వాలి.
- పరీక్ష మొదలయ్యే వరకు ప్రశ్నపత్రాల భద్రత బాధ్యత హెచ్‌ఎంలదే.
- ఎంఈవోల నుంచి ప్రశ్నపత్రాల తీసుకునే వెళ్లే సమయంలో ఆథరైజేషన్ లెటర్ ఇవ్వాల్సి ఉంటుంది.
- హెచ్‌ఎంలు పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడమే కాకుండా మూల్యాంకనం పాఠశాల స్థాయిలోనే జరపాలి.

**పది పరీక్షల మాదిరిగానే..**

10వ తరగతి పబ్లిక్ పరీక్షల మాదిరిగానే ఈ వార్షిక పరీక్షలను నిర్వహించాలి. ఎటువంటి అపోహలకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో పరీక్షలను నిర్వహించాల్సిన బాధ్యత హెచ్‌ఎంలపై ఉంది. ఎటువంటి అవకతవకలు, లోపాలు చోటుచేసుకున్నా సంబంధిత హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులపై చర్యలు తప్పవు.
– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం



### ఘనంగా సీతారాముల వన విహారోత్సవం



సీతారాముల వన విహారోత్సవం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి క్షేత్రపాలకుడు శ్రీసీతారాముల దివ్య కల్యాణ మహోత్సవాలలో భాగంగా ఏడో రోజు బుధవారం సీతారాముల వనవిహారోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు పెళ్లిపెద్దలు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి వెంట రాగా నవదంపతులు సీతారాములను ఊరేగింపుగా పేపర్‌మిల్లు పార్క్ వద్దకు తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక సింహాసనాలపై సీతారాములను, సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవిలను ప్రతిష్ఠించి పండితులు పూజలు చేశారు. నవదంపతులకు నూతన పట్టువస్త్రాలను దేవస్థానం అధికారులు అందజేశారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరభట్ల గంగబాబు, చిట్టిశివ, యనమండ్ర శర్మ, ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**నేడు సీతారాములకు శ్రీచక్రస్నానం**

గురువారం ఉదయం ఎనిమిది గంటలకు పవర్‌హౌస్ వద్ద గల పంపా నది వద్ద సీతారాములకు శ్రీచక్రస్నానం నిర్వహించనున్నట్లు పండితులు తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తారని తెలిపారు.

## చేబ్రోలులో ఎడ్ల పరుగు పోటీలు



ఎడ్ల పందేలు నిర్వహిస్తున్న దృశ్యం

**సీనియర్ విభాగంలో సామర్లకోటకు ప్రథమ బహుమతి**

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణ మహోత్సవాలలో భాగంగా బుధవారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలను నిర్వహించారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో విజేతలకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ బహుమతులను అందజేశారు. సీనియర్ విభాగంలో ఏడు జతలు పాల్గొనగా ప్రథమ, తృతీయ బహుమతులు సామర్లకోటకు చెందిన వల్లూరి సత్యేంద్ర కుమార్, ద్వితీయ బహుమతి అనకాపల్లి జిల్లా చుక్కపల్లికి చెందిన మజ్జి రాజేష్, జూనియర్స్ విభాగంలో 34 జతలు పాల్గొనగా ప్రథమ బహుమతి కొవ్వాడకు చెందిన మట్ల నవనీత్ శ్రీమణికంఠ, ద్వితీయ బహుమతి మొగిలి ఏసుబాబు, తృతీయ బహుమతి పెద్దాపురానికి చెందిన గాదపు ప్రేరణ, 4వ బహుమతి వన్నెపూడికి చెందిన భవిరిశెట్టి మణి, 5వ బహుమతి వెల్దుర్తికి చెందిన సోము శివపార్వతి గెలుపొందారు. న్యాయ నిర్ణేతలుగా సిద్ధి నానాజీ, చేకూరి రామకృష్ణ, యనమల రామకృష్ణుడు వ్యవహరించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల నాగలోవరాజు, వైఎస్సార్ సీపీ నేత అరిగెల రామయ్యదొర పాల్గొన్నారు.



సీనియర్ విభాగంలో గెలుపొందిన వల్లూరి సత్యేంద్ర కుమార్‌కు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

## సత్యదేవుని పాత అలంకరణ సామగ్రి వెండి 97.100 కేజీలు

- ఈఓ అజాద్ సమక్షంలో తూకం వేసిన అధికారులు
- మింట్‌లో కరిగించి పరిశుద్ధ వెండిగా మార్చే అవకాశం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వృథాగా స్టోర్స్‌లో ఉన్న పాత వెండి సామగ్రిని మింట్ ద్వారా కరిగించి పరిశుద్ధమైన వెండిగా తయారు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతంలో కూడా ఇదేవిధంగా వెండిని కరిగించి ఐదు కిలోల బార్లుగా మార్చి వాటిని ఆన్‌లైన్‌లో విక్రయించి ఆ మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఇప్పుడు కూడా అదే విధంగా చేసేందుకు ఈఓ చంద్రశేఖర్ అజాద్ పాత వెండిని బుధవారం తూకం వేయించగా 97.100 కేజీల వెండి వచ్చింది. స్వామివారి ఆలయాన్ని 2011–12లో పునర్నిర్మించిన విషయం విదితమే. అప్పుడు స్వామివారి గర్భాలయంలో గల వెండి రుద్రాక్ష మంటపం, మకర తోరణం, దానికి వెనుగ గల వెండి రేకు మొదలగునవి తీసేసి వాటి స్థానంలో దాతల సహకారంతో బంగారంతో చేయించినవి ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అవి అర్చకుల స్టోర్స్‌లో ఉన్నాయి. వాటిని తూకం వేయించి స్వాధీనం చేసుకోవాలని పలుమార్లు వారు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదు. కాగా, ఇదే విషయాన్ని దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్‌కు తెలియచేయగా ఆయన సమక్షంలో బుధవారం దేవస్థానం అర్చకుల వద్ద గల పాత వెండి సామగ్రిని వెలుపలకు తీయించారు. వాటిని కలప చట్రాల నుంచి వేరు చేసి తూకం వేయగా వెండి 97.100 కేజీలు ఉంది. ఇతర వస్తువుల నుంచి ఇత్తడి 4.500 కేజీలు, రాగి 9.030 కేజీలు వచ్చినట్లు తెలిపారు. వెండిని మింట్‌కి తరలించి కరిగించే వరకు దేవస్థానం అకౌంట్స్ విభాగంలోని లాకర్‌లో భద్రపరుస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పేరూరి భద్రీ నారాయణ, ఏఈఓ కృష్ణారావు, ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్, ఇంజినీరింగ్ అధికారులు, ఎస్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.



అలంకరణ వస్తువుల నుంచి పాత వెండి సామగ్రిని వేరు చేస్తున్న దృశ్యం

## సీఎం ఫొటోలు మార్ఫింగ్ చేసిన వ్యక్తిపై కేసు

కాకినాడ క్రైం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రాలు మార్ఫింగ్ చేసి కించపరిచే పోస్టులు పెట్టిన ఓ వ్యక్తిపై కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ దుమ్ములపేటకు చెందిన టీడీపీ సానుభూతి పరుడు సీరపు చిన్నా ఈ నిర్వాకానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. శుక్రవారం ఉదయం అతనిని ఇంటి వద్ద అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా పరారయ్యాడని పోలీసులు తెలిపారు. సీరపు చిన్నా నిర్వాకాన్ని వెనకేసుకొస్తూ టీడీపీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో కాకినాడ టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులను బెదిరిస్తూ స్టేషన్లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు.



ఎస్ఐకు వేలు చూపి బెదిరిస్తున్న టీడీపీ నాయకుడు



# పెన్షన్ లైన్‌లో విషాదం

**పెదపూడి బాణసంచా ప్రమాదంలో గాయపడ్డ మరో వ్యక్తి మృతి**

సామర్లకోట: స్థానిక పెన్షన్ లైన్‌లో తీవ్ర విషాదం నెలకొంది. పెదపూడిలోని బాణసంచా తయారీ షాపులో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడ్డ దోకుబుర్ర రాజు చికిత్స పొందుతూ బుధవారం ఉదయం చనిపోయాడు. దీంతో స్థానికంగా విషాద ఛాయలు నెలకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడ్డ పాలపాటి శేషారావు (38), దోకుబుర్ర రాజు (40)ను కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా మంగళవారం శేషారావు మృతిచెందిన సంగతి తెలిసిందే. రెక్కాడితేనే గాని డొక్కాడని కుటుంబానికి చెందిన రాజు, శేషారావు తమ కుటుంబాలను పోషించుకోవడానికి తమకు తెలిసిన విద్య అయిన బాణసంచా తయారీ షాపులలో కూలీలుగా పని చేస్తున్నారు. రోజూ మాదిరిగానే మంగళవారం పెదపూడిలోని బాణసంచా తయారీ షాపునకు వెళ్లి మృత్యువాత పడ్డారని వారి కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. దోకుబుర్ర రాజుకు భార్య భవానీ,కుమార్తె నిశి ఉన్నారు. పాలపాటి శేషారావుకు భార్య మహాలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు సుష్మ, స్వాతి ఉన్నారు. తమ ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న రెండు కుటుంబాల వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



రాజు (పాత చిత్రం)



భార్య కుమార్తెలతో శేషారావు (పాత చిత్రం)

**సమగ్ర దర్యాప్తు : ఏఎస్పీ**

పెదపూడి: ఘటన స్థలాన్ని మంగళవారం రాత్రి కాకినాడ ఏఎస్పీ పి.శ్రీనివాసు పరిశీలించారు. బాణసంచా తయారీకి సంబంధించిన మూడు షెడ్‌లు, పరిసరాలు లైసెన్సు పత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ షాపునకు ఈ ఏడాది సెప్టెంబర్ 24 వరకు లైసెన్సు ఉందన్నారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నామన్నారు.

**వేసవి ఎండ వేడిమి కారణమా?**

ఈ ప్రమాదం మధ్యాహ్నం సమయంలో జరిగింది. అంతవరకు కూలీలు జువ్వల తయారీలో భాగంగా టపాకాయల మందు కూరుతున్నారు. భోజన సమయం కావడంతో ఆ పని పక్కన పెట్టారు. ఆ సమయంలో వేసవి ఎండ వేడిమి ఎక్కువైన కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు, రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. బాణసంచా తయారీ కేంద్రంలో మూడు షెడ్లు ఉన్నాయి. ఈ కేంద్రానికి మూడు వైపులా పొలాలు ఉండి, ఒకవైపు జి.మామిడాడ, కాకినాడ ఆర్‌అండ్‌బీ మెయిన్ రోడ్డు ఉంది. ఇక్కడ ఈ బాణసంచా తయారీ కేంద్రం ఏర్పాటు చేసి ఐదేళ్లు అయింది.



బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు జరిగిన రెండో షెడ్డు

## క్రైం కార్నర్..

### బాలికను మోసం చేసిన వ్యక్తిపై కేసు

కొత్తపేట: బాలికను మోసం చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు కొత్తపేట అదనపు ఎస్సై డి.శశాంక బుధవారం తెలిపారు. మండల పరిధిలోని బిళ్ళకూరు గ్రామ శివారు వాకాడవారిపాలెంకు చెందిన కొండేపూడి వెంకటేశ్వరరావు(30) అదే గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడని, బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్సై తెలిపారు.

### గిల్టు గొలుసు చోరీ.. దొంగలకు దేహశుద్ధి

తాళ్లరేవు: స్థానిక మార్కెట్ వీధిలో నడిచి వెళుతున్న ఒక వృద్ధురాలి మెడలోని గొలుసును ఇద్దరు యువకులు సినీఫక్కీలో చోరీ చేసేందుకు ప్రయత్నించగా స్థానికులు వెంబడించి వారిని పట్టుకున్న వైనమిది. స్థానికులు, కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన వృద్ధురాలు నడిచి వెళుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు ఆ వృద్ధురాలి మెడలోని గొలుసును ఒక్కసారిగా లాక్కుని వెళ్లిపోతుండగా సమీపంలోని ఒక ఐరన్ షాపులో పనిచేస్తున్న కార్మికులు వారిని వెంబడించడంతో బైక్ అదుపుతప్పి పడిపోయారు. దీంతో వారిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు కోరంగి ఎస్సై పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఇలా ఉండగా వారు లాక్కు వెళ్లిన గొలుసు గిల్టు నగగా తెలియవచ్చింది!





తాళ్లరేవులో యువకులకు దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

## కోలుకుంటున్న ఇంజినీరింగ్ విద్యార్థులు

ముమ్మిడివరం: మండలంలోని కొమానపల్లిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఇంజినీరింగ్ విద్యార్థులు కోలుకుంటున్నారు. మృతిచెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని కోనా నిఖిత మృతదేహానికి బుధవారం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న సఖినేటిపల్లి మండలం గుడిమళ్లకు చెందిన కోన నిఖిత (22), నరసాపురం మండలం పెనుమదం గ్రామానికి చెందిన మల్లు సూర్యసాయి, పశ్చిమ గోదావరి జిల్లా చిక్కాలకు చెందిన నక్కా జయశ్రీ, సఖినేటిపల్లికి చెందిన రాపాక డానియేలు, పెరవలి మండలం ఉలుసుమర్రుకు చెందిన తారుపల్లి మమత మంగళవారం కాకినాడ బీచ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ముమ్మిడివరం మండలం కొమానపల్లి 216 జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి పల్టీలు కొట్టడంతో ఐదుగురూ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిలో కోన నిఖితను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. మిగిలిన నలుగురిలో సూర్యసాయి, మమత బుధవారం అమలాపురం ప్రవేటు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ కాగా నక్కా జయశ్రీ, రాపాక డానియేలు ఇంకా కాకినాడ జీజీ హెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఎస్సై కె.సురేష్‌బాబు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన నిఖిత.. కోన రూపెన్, లక్ష్మి దంపతులకు పెద్ద కుమార్తె. తల్లి లక్ష్మి గల్ఫ్‌లో ఉంటోంది. రూపెన్‌తో కలిసి నిఖిత, కుమారుడు ఉంటున్నారు. కుమార్తె మృతితో రూపెన్ తీవ్రంగా రోదిస్తున్నారు.

## విద్యుదాఘాతానికి వ్యవసాయ కూలీ మృతి

దేవరపల్లి: దేవరపల్లిలో విద్యుదాఘాతానికి గురై వ్యవసాయ కూలీ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం దేవరపల్లికి చెందిన కవులూరి సోమరాజు(23) బుధవారం ఉదయం 11 గంటల సమయంలో మరికొంత మంది కూలీలతో కలిసి రైతు మండపాటి బాలాజీకి చెందిన పొగాకు తోటలో ఆకురెలుపునకు వెళ్లాడు. ఆకు రెలిసి ట్రాక్టర్‌పై లోడు చేసి, బరకం కడుతుండగా పైన గల విద్యుత్ తీగలు సోమరాజు తలకు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. చికిత్స పొందుతూ సోమరాజు మృతి చెందినట్టు ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు. మృతుడు సోమరాజుకు భార్య, తొమ్మిది నెలల కుమారుడు ఉన్నారు. భార్య సుభాషిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.